# స్ట్రాంగ్ రూమ్‌లకు చేరిన ఈవీఎంలు

- ఎన్నికల పరిశీలకులు, ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లకు సీల్
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, సీపీ
- సీసీ కెమెరాలతో పర్యవేక్షణ, సాయుధ బలగాల పహారా


స్ట్రాంగ్ రూమ్‌కు సీల్ వేస్తున్న ఎన్నికల సిబ్బంది



వివరాలను తెలుసుకుంటున్న నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు


స్ట్రాంగ్ రూం వద్ద పహారా కాస్తున్న సాయుధ పోలీసులు

ఖలీల్‌వాడి, డిసెంబర్ 1: నిజామాబాద్ జిల్లాలోని ఆరు శాసనసభ నియోజకవర్గాల పరిధిలో ప్రశాంత వాతావరణం నడుమ సాఫీగా పోలింగ్ ప్రక్రియ ముగిసింది. అనంతరం కట్టుదిట్టమైన భద్రత నడుమ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను కౌంటింగ్ కేంద్రాల్లోని స్ట్రాంగ్ రూమ్‌లకు చేర్చారు. ఆయా సెగ్మెంట్ల నుంచి ఈవీఎంలు ఓట్ల లెక్కింపు కేంద్రాలైన నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు తరలించారు. వాటిని సరి చూసుకొని స్ట్రాంగ్ రూముల్లో ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా అమర్చారు. పోటీలో ఉన్న అభ్యర్థుల ఏజెంట్లు, ఎన్నికల పరిశీలకుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లకు శుక్రవారం ఉదయం సీల్ వేశారు. జిల్లా ఎన్నికల అధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, పి.యాదిరెడ్డి తదితరులు ఈవీఎంల భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఈవీఎంలను భద్రపర్చిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సాయుధ బలగాలతో పహారా ఏర్పాటు చేశారు. ఎలాంటి అనుమానాలకు తావులేకుండా స్ట్రాంగ్ రూంలతోపాటు వాటి పరిసరాలను పరిశీలించేందుకు వీలుగా సీసీ కెమెరాలను అమర్చి మానిటర్ల ద్వారా పర్యవేక్షిస్తున్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద శుక్రవారం సాయంత్రం 5 గంటల నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉటుందని సీపీ తెలిపారు. కలెక్టర్, సీపీలు అక్కడ అన్ని ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపు విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది, అభ్యర్థులు, ఏజెంట్ల రాకపోకల కోసం వేర్వేరు మార్గాల్లో ఏర్పాటు చేసిన బారికేడ్లను పరిశీలించారు. అదనపు డీసీపీ జయరాం, ఆర్డీవో రాజేంద్రకుమార్, మెప్మా పీడీ రాజేందర్, పలు శాఖల అధికారులు ఉన్నారు.

# బాల్కొండలో ఎగిరేది గులాబీ జెండానే..

## మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి


పోలింగ్ సరళిపై నాయకులు, కార్యకర్తలతో సమీక్షిస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

కమ్మర్‌పల్లి, డిసెంబర్ 1 : బాల్కొండ నియోజకవర్గంలో ఎగిరేది గులాబీ జెండానే అని మంత్రి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ప్రారంభమైనప్పటి నుంచి నిత్యం తన విజయం కోసం కృషిచేసిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ప్రజల అభిమానం, ఆదరణతో నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగరబోతున్నదని, బీఆర్‌ఎస్ పార్టీ ఘనవిజయం సాధిస్తుందని పేర్కొన్నారు. ఓటింగ్ ప్రక్రియను సాఫీగా నిర్వహించిన ఎన్నికల అధికారులకు అభినందనలు తెలిపారు.

### కార్యకర్తలతో మాటామంతి ...

వేల్పూర్, డిసెంబర్ 1: మండల కేంద్రంలో బాల్కొండ బీఆర్‌ఎస్ అభ్యర్థి వేముల ప్రశాంత్‌రెడ్డి నివాసంలో నియోజకవర్గంలోని కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులతో శుక్రవారం మంత్రి మాట్లాడారు. గురువారం నియోజకవర్గంలో జరిగిన పోలింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అన్ని గ్రామాల్లో కూడా బీఆర్‌ఎస్‌కే ప్రజలు మొగ్గు చూపారన్నారు. సమావేశంలో నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ మండల కన్వీనర్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు తదితరులున్నారు.

# అయ్యప్ప మహా పాదయాత్ర ప్రారంభం



జెండా ఊపి మహా పాదయాత్రను ప్రారంభిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ, డిసెంబర్ 1: బాన్సువాడ డివిజన్ కేంద్రం నుంచి శబరిమలకు వెళ్లే అయ్యప్ప మహా పాదయాత్ర శుక్రవారం ప్రారంభమైంది. పాదయాత్రను స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి పట్టణంలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ శ్రీనివాసరెడ్డిని అయ్యప్ప మాలధారులు ఆశీర్వదించారు. కార్యక్రమంలో గురుస్వామి గురువినయ్‌కుమార్, అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడు ముదిరెడ్డి విఠల్‌రెడ్డి, దూశెట్టి రమేశ్, విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భక్తుల కొంగు బంగారం...

# రామారెడ్డి కాలభైరవుడు

- జన్మదిన వేడుకలను ముస్తాబైన ఆలయం
- నేటి నుంచి 6వ తేదీ వరకు ఉత్సవాలు


కాలభైరవ స్వామి ఆలయం


స్వామి వారి మూల విరాట్టు

రామారెడ్డి, డిసెంబర్ 1: నిజామాబాద్ జిల్లా రామారెడ్డి మండలం ఇసన్నపల్లి, రామారెడ్డి గ్రామాల మధ్య వెలసిన ఈశాన్య క్షేత్ర పాలకుడిగా సమస్త భక్తుల పూజలు స్వీకరిస్తూ కోరిన కోర్కెలు తీరుస్తూ అనుగ్రహిస్తున్న స్వామి శ్రీకాలభైరవ స్వామి. కాలభైరవుడికి కాలరాజు, కలుషాదుడు అనే పేర్లు కలవు. కాలభైరవ పూజ మంగళవారం అష్టమి తిథుల్లో చేసిన అధిక ఫలమిస్తుందని ప్రతీతి. స్వామి చుట్టూ 8 లేక 108 సార్లు ప్రదక్షిణ చేయడం ఇక్కడి సాంప్రదాయం. దేవాలయంపై గోపురం లేకపోవడం, అశ్వ తీర్థ వక్షం చాయలో ఉండడం ఎంతో పవిత్రమైంది. ప్రతి ఏటా శ్రీకాలభైరవస్వామి జన్మదినోత్సవ వేడుకలు ఐదు రోజుల పాటు వైభవంగా జరుగుతాయి.

### మూల బావి ప్రాముఖ్యత...

ఆలయాల్లో ఉన్న మూల బావి నీటితో రోగ పీడితులు 41 రోజులు రోజుకు రెండు సార్లు స్నానం ఆచరిస్తే పలు చర్మ వ్యాధులతోపాటు అఖండ సౌభాగ్యాలు, సంతానం కలుగుతాయని, వివాహం జరుగుతుందని అపార నమ్మకం. కాలభైరవస్వామి జన్మదిన వేడుకలు ప్రతి సంవత్సరం కార్తిక బహుళ పంచమి నుంచి నవమి వరకు అంగరంగ వైభవంగా ఐదు రోజుల పాటు జరుగుతాయి. మొదటి రోజు సంతతాధారాభిషేకంతో ఆరంభమై చివరి రోజు రథోత్సవం, అగ్నిగుండాలతో ముగుస్తాయి. ఈ ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రాల నుంచి భక్తులు వస్తుంటారు.

### కాలభైరవ జన్మదిన వేడుకలు ఇలా..

శ్రీకాలభైరవ స్వామి జన్మదిన వేడుకలు 2వ తేదీన శనివారం ఉదయం ఆరు గంటలకు గణపతి పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, సంతతధారాభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 3వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు బద్ది పోశమ్మకు బోనాలను సమర్పిస్తారు. 4వ తేదీన లక్ష దీపార్చన, సాంస్కృతిక కార్యక్రమాలు, 5న ఉదయం సంతత ధారాభిషేకం సమాప్తి, ధ్వజారోహణం, మహాపూజ, సిందూర పూజ, డోలారోహణం, సాయంత్రం ఎడ్లబండ్ల ప్రదర్శన, రాత్రి బద్రకాళి పూజ, పల్లకీ సేవ, రథోత్సవం, ఒగ్గుకథ కాలక్షేపం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 6వ తేదీన అగ్నిగుండాలు నిర్వహిస్తారు.

### సౌకర్యాలు కల్పిస్తున్నాం..



ఉత్సవాలకు తరలివచ్చే భక్తుల కోసం అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఐదు రోజులపాటు ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం. వేడుకలకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు.

**- ప్రభురాంచంద్రం, ఆలయ ఈవో**

### కష్టాలను దూరం చేసే దేవుడు..



కాలభైరవుడు భక్తుల కష్టాలను దూరం చేసి అండగా నిలిచే కరుణామూర్తి. స్వామి వారికి నిత్యం జలాభిషేకం, సిందూర పూజలు నిర్వహిస్తాం. అష్టమి తిథులతోపాటు శ్రావణ, వైశాఖ, కార్తిక మాసాల్లో ప్రత్యేక పూజలు ఉంటాయి.

**- రాచర్ల శ్రీనివాస్ శర్మ, ఆలయ పూజారి**